# తప్పు చెయ్యని వాడంటే!

''తల్లీ, జాగ్రత్త, పాస్‌పోర్టు, వీసా కాగితాలు బ్యాగులో జాగ్రత్తగా పెట్టుకో నూయార్క్‌లో నీతోటి వారంతా ఎటువెళ్తుంటే అటు వెళ్లు- సూట్‌కేసులు తీసుకునే టప్పుడు చూసి జాగ్రత్తగా తీసుకో. లగేజ్ స్లిప్ పెట్టుకున్నవా. బోర్డింగ్ పాస్ చూపించాలి ప్లేనులో ఎక్కేముందు. ఇదిగో వీరు తెలుగువారు. న్యూయార్క్ వెడుతున్నారుట. నీకేం భయంలేదు. నిన్ను జాగ్రత్తగా బయటివరకు తీసికెళ్లి శ్రీరాంకి అప్పగిస్తామని చెప్పారు.' అత్తగారింటికి మొదటిసారి, అందులో దేశంకాని దేశం వెడుతున్న కూతురికి, ఆంధ్రదేశం ఎన్నడూ దాటని కూతురికి మొదటిసారి ఒంటరిగా ప్రయాణం అవుతుంటే ఓ తండ్రి పడే ఆరాటం, అదుర్దా, భయంఅది. బొంబాయి వరకు దిగ బెట్టడానికి వచ్చిన తండ్రి ఆఖరిసారి చెప్పే జాగ్రత్తలు అవి.

''పరవాలేదు నాన్న, మీరేం కంగారు పడకండి, వీళ్లు తోడున్నారుగా'' గుండెల్లో గుబులున్నా తండ్రికి ధైర్యం చెప్పింది విజయ - అమెరికా సంబంధం, ఇంజనీరు, రావడం, చూడడం, నచ్చడం, పెళ్లి అంతా పదిహేను రోజులలో ఏదో కలలో మాదిరి అయిపోయింది. వారం రోజులు కొత్త భర్తతో ఊటీ వెళ్లి హనీ మూన్ కాంగానే, ముందు వెళ్లి వీసా కాగితాలు, టిక్కట్టు అవిపంపిస్తానంటూ బోస్టన్ వెళ్లిపోయాడు శ్రీరాం - స్టూడెంటు వీసా మీద వున్నాడు కనక నెలాపది హేను రోజులలో వీసా కాగితాలు, టిక్కెట్టు పంపుతూ బయలుదేరి రమ్మని ఫోను చేశాడు. న్యూయార్క్ వచ్చి రిసీవ్ చేసుకుంటానన్నాడు. పుట్టింది పెరిగింది చదివింది విశాఖపట్నం. అమ్మమ్మగారి వూరు కాకినాడ, అత్తగారి వూరు రాజమండ్రి యివి దాటి బయటికెళ్లింది లేదు. స్కూలు, కాలేజి, యూనివర్సిటి ఎమ్మెస్సీ కాంగానే పెళ్లి, అసలు ఆలోచించడానికన్నాటైములేకుండా ఒకదాని వెంట ఒకటి జరిగిపోయి మిసెస్ శ్రీరాం అయిపోయి అమెరికాకి ప్రయాణం కట్టింది విజయ.

సెక్యూరిటీ చెక్ కని వినపడింది - 'పదమ్మా పిలుస్తున్నారు.' రామనాథం గారి గాభరా. కొంచెం కొంచెం అంటూ తల్లి సర్దిన పచ్చళ్లు, పొడులు, స్వీటులు వున్న షోల్డర్‌బ్యాగు ఎత్త బుజాన వేసుకుంటుంటే బుజం దిగలాగింది అలవాటు లేని బరువుకి. అది చూసిన తండ్రి హృదయం గిలగిల్లాడింది' ఏమిటో అక్కడెవరూ ఉండరు. ఇంతంత సూట్‌కేసులు మోసుకుని ప్రయాణం చెయ్యాలి. కాస్త ఎవరినన్నా సాయం అడుగు తల్లీ. పదమ్మా అదుగో వారు వెళ్తున్నారు. వారి వెనకవుండు.' రామనాథం గారి కళ్లు నిండాయి. విజయ బేలగా 'నాన్న' అంటూ తండ్రి బుజం మీదతల వాల్చింది. 'జాగ్రత్తమ్మా, వెళ్లగానే ఫోను చేయించు. అంతవరకు మాకుదిగులు' పట్టుకున్న గొంతుతో అన్నారాయన.

''మీరేం వర్రీ కాకండి సార్. న్యూయార్క్‌లో మీ అల్లుడికి అప్పగించే పూచి మాది నవ్వుతూ భరోసా ఇచ్చారు ఓ తెలుగాయన. రామనాథం గారు కూతురిని చేయిపట్టుకుని సెక్యూరిటీ వైపు నడిపించుకొని వెళ్లి విజయ లోపలికి వెళ్లగానే, ప్లేను టేకాఫ్ కనపడే చోటికి వెళ్ళారు బరువెక్కిన గుండెతో.

భర్త దగ్గరికి వెడ్తున్న ఆనందం, విదేశాలు చూడపోతున్నందుకు ఆనందంతో మనసు ప్లేనుతో పాటు గాలిలో ఎగిరింది, కన్నవాళ్ళని వదిలి వెడ్తున్న బాధని మరిపిస్తూ. ప్లేను కనుమరుగయేంత వరకు చూసి వెనుదిరిగాడు తండ్రి.

★ ★ ★ ★ ★

న్యూయార్క్‌లో మహాసముద్రం లాంటి ఆ ఎయిర్‌పోర్టులో అన్ని చెకింగులు ముగించుకొని, సూటుకేసుల ట్రాలీ తోసుకుంటూ లాంజ్ లోకి రావడానికి రెండు గంటలు పట్టింది. ఎంట్రన్స్ దగ్గర ఆరాటంగా ఎదురుచూస్తున్న శ్రీరాంని చూసేక మనసు కుదుటపడింది. శ్రీరాం ఆరాటంగా ఎదురెళ్ళి ట్రాలీ తీసుకుని 'అబ్బ రెండుగంటలయింది ప్లేను లాండ్ అయి, యింతసేపు పట్టింది. వచ్చారా లేదా అని ఒకటే కంగారుపడ్డా. బాగా క్యూలున్నట్లున్నాయి.' పలకరించాడు. భర్తతో ఇంకా అట్టే పరిచయం లేని విజయ సిగ్గుపడ్తు తలదించుకుంది. శ్రీరాం అది చూసి నవ్వి భుజం చుట్టూ చేయివేసి 'కమాన్, యింకా పెళ్ళి కుమార్తెలా సిగ్గుపడ్తున్నావేమిటి' అన్నాడు. విజయ నవ్వి 'అబ్బ, ఏం ఎయిర్‌పోర్టు, ఎంత క్యూ, కాళ్లు పీక్కుపోయాయి. ఈ సామాను మోసేసరికి తాతలు దిగివచ్చారు.' అంది. 'ఇదేం ఇండియా కాదమ్మగారు. నాల్గు రూపాయలు పడేసి సమాన్లు మోయించడానికి, ఇక్కడ ఎవరి సామానులు వారే మోసుకుంటారు. అదే అలవాటవుతుంది. నీకింకా కొత్తగా-' అన్నాడు.

''అన్యాయం సార్, ఈవిడ చూడండి మీరు కనపడగానే మమ్మల్ని మర్చిపోయింది. కనీసం థాంక్స్ అన్నా చెప్పలేదు' తెలుగతను నవ్వుతూ కంప్లైంట్ చేసాడు. విజయ నాలిక కరుచుకుంది. 'సారీ, ఈయన న్యూయార్క్‌లో వుంటారు. నాకు చాలా సాయం చేశారు. 'థాంక్స్ సార్, గ్లాడ్ టు మీట్ యూ' ఇద్దరు మగవాళ్లు హేండ్‌షేక్ చేసి పరిచయాలు చెప్పుకుని శెలవు తీసుకున్నారు, మళ్లీ కలుద్దాం అనుకుంటూ.

బయటికి వచ్చి కారు పార్కింగ్ నించి కారు తెచ్చి సామాన్లు సర్దాడు. వేలకొద్ది పార్క్ చేసిన కారులని, నిమిషానికో ప్లేను రావడం, పోవడం, ఆ హడావిడి అంతా కొత్తగా తెల్లపోతూ చూసింది విజయ. 'పద, కారెక్కు. దీనికే అలా ఆశ్చర్యపోతూ నిలబడి పోకు' అన్నాడు. విజయ సిగ్గుపడి కారెక్కింది.

హైవే మీద న్యూయార్క్ నించి బోస్టన్ రెండున్నర మూడు గంటల ప్రయాణం. ఆ రోడ్లు, ఇటు నాలుగు, అటు నాలుగు వరసల రోడ్లు. ఫ్లైఓవర్లు, చీమల బారుల్లా రయిమని దూసుకుపోతున్న కార్లు, ఎనభై, తొంభై కిలోమీటర్ల వేగంతో వెడ్తున్నా ఎక్కడా కుదుపు, ధూళి అన్నాలేని రోడ్లు అన్ని వింతగా చూడసాగింది. కొత్త భర్త – పెళ్లయివారం కూడా గడపని భర్త పక్కన వున్నా అతని కంటే ఆ పరిసరాలే ఆమెని ఆకర్షణంలో పడేసిమైమరపించాయి. 'ఏమిటి విశేషాలు చెప్పు ఆ రోడ్లు అవి తరువాత చూద్దువుగాని, ఇంక ఇక్కడే వుంటావుగా. మాట్లాడు'. శ్రీరాం కినుకగా అన్నాడు. విజయ చప్పున తెలివితెచ్చుకున్నట్టు చూపు తిప్పుకుని నవ్వింది.

సాయంత్రం ఏడున్నరయినా చీకటి పడలేదు.సరిగదా ఏ నాలుగో అయినట్టు వెలుతురుంది. కారు బోస్టన్ చేరే సరికి. ఓ టూ బెడ్‌రూము బంగళా అతనిది. ఇంటి ముందు చిన్న లాను. సీజన్ ఫవర్స్ వున్న తోట విజయకి స్వాగతం చెప్పింది. ఇల్లు ముచ్చటగా డ్రాయింగు రూము, డైనింగు, కిచెను, రెండు బెడ్‌రూములు, ఇల్లంతా కార్పెట్టు, అన్నీ కొత్త సామాను, ఫర్నిచర్ ఇల్లు చూసి మురిసిపోయింది. శ్రీరాం కారులోంచి సామాను తెచ్చి గదిలో పెట్టేలోగా ఓ సారి యిల్లంతా కలయతిరిగింది. అన్నింటికంటే తళతళ లాడే బాత్ రూములు, ఫిట్టింగులు చూసి ఎంత బాగున్నాయో అనుకుంది. 'బాగుందా, దేవిగారికి ఇల్లు నచ్చిందా.. నీ కోసం అన్నీ కొని, కష్టపడి సర్దాను. వారం రోజులుగా ఇదేపని విజయ భుజాల మీద చేతులు వేసి కళ్లలోకి ప్రేమగా చూసాడు. విజయ తలదించుకుని అతని గుండెల్లో మొహం దాచుకుంది.

* * * * *

కాలింగ్‌బెల్ మ్రోగింది. శ్రీరాం ఆఫీసుకి వెళ్ళాక సావకాశంగా డస్టింగ్ చేస్తున్న విజయ ఆశ్చర్యంగా తలుపుతీసింది. ఎదురుగా ఫారిన్ వనిత. చేతిలో రెండేళ్ళపైన వున బాబుని ఎత్తుకుని నిలబడివుంది. ఎవరో యిరుగు పొరుగు అవిడ తను వచ్చిందని చూడడానికి వచ్చిందేమోనని సందిగ్ధంగానే చూస్తూ నవ్వి 'కమిన్' అని మర్యాదగా ఆహ్వానించింది. ఆమె గుమ్మంలోంచి లోపలికి వచ్చి 'శ్రీరాం-శ్రీరాం అంటూ 'యూ.. యూ' అంది. ఆమె ఆశ్చర్యపోయినట్టు చూసింది. 'ఐ ఫ్రెంచ్, నో ఇంగ్లీష్' అంది మాటలకి తడుముకుంటూ. విజయ తడబడ్తూ ఈవిడ ఇంగ్లీషు రాదంటుంది. ఎలా అనుకుంటూ సైగచేసి 'కమ్, సిట్‌డౌన్' అంది. ఆమె సందేహిస్తున్నట్టు లోపలికి వచ్చి కూర్చుంది. ఆమె తెల్లగా ఫారెనర్‌లావున్నా, ఆ బాబు మాత్రం చామనచాయలో ఇండియన్ పోలికలతో వున్నడు. ''హు ఆర్ యూ, వాట్ కెన్ ఐడూ ఫర్ యూ' ఇంగ్లీషు వత్తి వత్తి నెమ్మదిగా మాట్లాడింది. అర్థం అవుతుందేమోనని. 'రాం ఆఫీస్'? అనడిగింది. 'రాం, అంటూ ఇంత చనువుగా పిలుస్తూంది. ఈవిడెవరో, ఎందుకొచ్చిందో.. విజయకేం అర్థం కాలేదు. 'మీరెవరు' అన్నట్టు సాంజ చేసింది. 'మీ – సుసాన్.. రాం.. రా.' అంటూ చేతిలో వున్న బాబుని చూపింది. 'రాం.. బేబి' అంది మళ్ళీ. విజయ గుండె ఒక్క క్షణం లయతప్పింది. మళ్ళీ టేబిల్‌మీద వున్న శ్రీరాం ఫోటో వైపు చేతిలో బాబుని చూసి 'రాం.. బేబి' అంది విజయ మొహం నల్లబడింది. ఏమిటి రాం కొడుకా. ఈవిడని రాంపెళ్లి చేసుకున్నాడా – పిల్లాడు కూడా వుండగా.. ముందే పెళ్లి అయి బాబు కూడా వుండగా మళ్ళీ తననెందుకు చేసుకున్నాడు. మోసం చేశాడా.. ఎంత దగా! వారం రోజులుగా అనుభవించిన ఆనందం అంతా గాలితీసిన బెలూన్‌లా చప్పబడిపోయింది. కావాలని తనని మోసం చేసి పెళ్ళి చేసుకున్నారా. ఇదంతా దాచి, ఇండియా వచ్చి తనని చేసుకున్నాడా.. ఇది వరకు చూసిన ఓ సినిమాలో జయప్రదని చిరంజీవి యిలాగే పెళ్లి చేసుకుని తీసుకొస్తాడు ఫారెన్ భార్యని వుంచుకొని ఇంట్లో పని మనిషిలా వుండడానికి, పెళ్ళాడి తెచ్చి నానా బాధలు పెడ్డాడు. ఈ మధ్య కూడా ఎవరో చెప్పుకుంటూంటే వింది. అక్కడ ఫారెన్ లేడిని పెళ్లాడి తల్లితండ్రుల మాట కాదనలేక ఇండియాలో మరొకర్ని పెళ్లాడి వెళ్లిపోయి రాలేదని. చెప్పుకొన్నారు. ఫారెన్ సంబంధం అనగానే ఎగిరి గంతేస్తారు. ఇక్కడ జరిగే సంగతులు అక్కడెవరికి తెలుస్తాయి. కొందరు పెద్దవాళ్ళ మాట కాదనలేక చేసుకుని, కొందరు ఆ భార్యని ఇంటిపని కోసం, పిల్లల్ని కని వంశవృద్ధి కోసం చేసుకుని ఆ ఫారెన్ లేడితో సరదాలు, సరసాల కోసం వుంచుకొంటారని వింది. ఇది నిజమా! శ్రీరాం ఎంత మర్యాదగా కనిపించాడు. తనమీద ఎంత

ప్రేమ చూపాడు. తను అదృష్టవంతురాలిని అని తను, తనవారు మురిసిపోయారు. తన అదృష్టం నీడి బుడగేనా! క్షణంలో విజయుని లక్ష ఆలోచనలు చుట్టుముట్టాయి. విజయ మొహంలో కలవరం గుర్తించినట్టు, జాలిగా చూసి 'సారీ అంది. విజయ నోరు పెగుల్చుకొని 'మీరు అతన్ని పెళ్ళి చేసుకున్నారా' - మేరేజ్' అంటూ చేతివుంగరం చూపిస్తూ అంది. 'నో' అంటూ తలఅడ్డంగా తిప్పింది. 'శ్రీరాం బేబి' అంది మళ్ళీ బాబుని చూపించి. అంటే సరదా కోసం ఆమెను వాడుకుని కొడుకుని కన్నాడన్న మాట! ఇదంతా దాచి, తనని సాంప్రదాయంగా పెళ్ళాడాడన్న మాట! చీటింగ్ - ఎంత మోసం, దగా!

'ఐ గో.. కమ్.. టుమారో - టెల్ శ్రీరాం' అని లేచి వెళ్లాపోయింది సుసాన్. విజయ సోఫాలో కూలబడింది. ఆమె మెదడు మొద్దుబారినట్టు అయిపోయింది. వచ్చీరాగానే ఏమిటీ అపశృతి? ఇప్పుడు తనేం చెయ్యాలి. రామ్‌ని నిలదీసి అడుగుతుంది. అది నిజం అయితే తనేం చెయ్యాలి. తనని దాసి పనికే తీసుకొస్తే తన గతేమిటి. తల్లిదండ్రులకి చెప్పి ఇండియా వెళ్ళిపోవాలా. ఈ దేశంకాని దేశంలో వంటరిగా తాను ఏం చెయ్యాలి. ఆలోచిస్తుంటే దుఃఖం ముంచుకొచ్చింది. ఓగంటసేపు ఏడ్చాక. కాసేపు ఆలోచించి ముందసలు రామ్ ఏం చెపుతాడో వినాలి. ఇలా సుసాన్ వచ్చింది అంటే అతని రియాక్షన్ ఎలా వుంటుందో చూడాలి. అప్పటికయినా అతనంతట అతను ఏమన్నా నిజాయితీగా చెప్తాడేమో చూడాలి అని నిర్ణయించుకుంది.

'హాయ్ విజ్జి, ఏమిటింకా అలాగే వున్నావా సాయంత్రం వచ్చేసరికి రెడిగా ఉండమన్నాను కదా. షాపింగ్ వెడదాం అనుకున్నాం గదా, ఏడయింది. త్వరగా తయారవు. ఆఫీసు నుంచి వస్తూనే హడావిడి పెట్టాడు శ్రీరాం. ఉదయం నుంచి వంట చేయలేదు. అన్నం తినలేదు. అన్యమనస్కండా దిగాలుపడి కూర్చున్న విజయని చూసి 'అదేంటి అలా వున్నావు. వంట్లో బాగా లేదా!' ఆరాటంగా దగ్గరికి వచ్చి విజయ నుదుటి మీద చెయ్యివేశాడు. విజయ చెయ్యి తీసేసింది. 'ఏం లేదు వదలండి, షాపింగ్ కి యివాళొద్దు ముభావంగా అంది.' అరె ఏమయింది. అలా వున్నావేంటి? అన్నాడు. విజయ సూటిగా అతిని వంక చూసి 'సుసాన్ ఎవరు, ఆ సుసాన్ ఎవరో ఉదయం వచ్చింది' ఆ మాటతో శ్రీరాం మొహం ఒక్కసారిగా కళతప్పించి. కలవరపడిపోయాడు. 'సుసాన్ వచ్చిందా.. ఏమంది' ఆరాటంగా అడిగాడు. 'ఆవిడేమందో నాకర్థం కాలేదు. ఒక్కమాట తప్ప. ఆమెకి పుట్టిన పిల్లాడికి మీరు తండ్రి అన్నది తప్ప... ఆవిడ ఫ్రెంచ్‌ట.. ఇంగ్లీషు రాదంది -

మీరు లేరంటే రేపు మళ్ళీ వస్తానంది' అతని మొహంలో భావాలు గమనిస్తూ అంది. మారిన అతని మొహంలో రంగు, అతని కలవర పాటు చూస్తే సుసాన్ మాటల్లో నిజం వుందన్నది అర్థం అయింది.' 'ఓ, దట్ బిచ్..' ఏదో గొనిగాడు. శ్రీరాం అలా అనగానే తిరస్కారంగా చూసింది విజయ. 'బిచ్.. అమెని బిచ్‌గా చేసింది మీలాంటి మగాళ్ళేగా.'

'ఓ విజయా. నీకేం తెలీదు ఆ సుసాన్ సంగతి. ఏదో చెప్ప బోయాడు. 'ఆవిడ సంగతి నాకేం తెలియక్కర లేదు. మీ గురించిన యీ నిజం మా నించి దాచి నన్ను ఎందుకు పెళ్ళి చేసుకున్నారో అది కావాలి నాకు. ఇక్కడ ఓ స్త్రీతో సంబంధం పెట్టుకుని పిల్లాడ్నికని ఏమీ తెలియనట్టు అక్కడి కొచ్చి మమ్మల్ని మోసం చేసి పెళ్ళి చేసుకున్న మీ ధైర్యాన్ని అభినందిస్తున్నాను. నన్నింత దగా ఎందుకు చేశారు.. ఆవేశంగా మొదలు పెట్టిన విజయ గొంతు రుద్ధమయింది. 'ప్లీజ్ విజయా.. అలా మాట్లాడకు. నీకు అంతా చేప్తాను. అప్పుడు నీకు అర్థం అవుతుంది సుసాన్ సంగతి.. మిమ్మల్ని నేనేం మోసం చెయ్యలేదు. ''ఈ విషయం దాచడం మోసం కాక మరేమిటి''. ఉక్రోషంగా కన్నీళ్ల మధ్య అంది. 'ప్లీజ్ విజయా, అనవసరంగా ఏదో ఆలోచించి అపోహ పడద్దు నే చెప్పేది పూర్తిగా వన్నాక నీవేం అన్నా భరిస్తాను. ముందునే చెప్పేది విను...'' అనునయంగా అన్నాడు. 'నేను చెప్పేది కట్టు కథ కాదు. ప్రతి అక్షరం నిజం చెపుతాను. అప్పుడు నీవు ఏ శిక్ష విధించినా భరిస్తాను'' ప్రాధేయపూర్వకంగా చూవాడు. అతని మొహం చూస్తే అతను నిజంగానే బాధపడ్తున్నాడని, అతనికి చెప్పే అవకాశం యివ్వాలనిపించింది విజయకి, కళ్ళు తుడుచుకొని చెప్పండి, దయచేసి అబద్ధాలు చెప్పి యింకా మోసగించాలని మాత్రం అనుకోకండి.''

''విజయా.. ఈ విషయం నీకు పెళ్లికి ముందే ఎందుకు చెప్పలేదన్నది నీ ప్రశ్న. చెపితే నీవే గాదు. చూస్తూ చూస్తూ ఎవరు వప్పుకుంటారు అన్న భయంతో ముందుగా చెప్పలేదు. కానీ, పెళ్ళయిన రోజునించి చెప్పాలనే అనుకున్నను కానీ కొత్తగా పెళ్ళయిన ఈన ఆనందాన్ని హరించడానికి మనస్సు వప్పలేదు. ఇక్కడికి వచ్చాక చెపుదామని వాయిదా వేశాను. నీవింకా వచ్చి వారం అయింది. నాల్గు రోజులు సరదాగా తిరుగుదాం. ఎంతయినా నీ మనసు బాధ పడ్తుంది కదా, సావకాశంగా ఓ రోజు చెపుదాం అనుకునే లోపలే ఈ సుసాన్ ఇంత తొందరగా నా అడ్రసు వెతికి పట్టుకుని వస్తుందని ఊహించలేదు. ఏదో రోజు యిలా వచ్చి బ్లాక్ మెయిల్ చెస్తుందని ఊహించాను గానీ నే చెప్పేలోగానే యింత తొందరగా వస్తుందని ఊహించక పోవడం నాదే తప్పు' దోషిలా తలదించుకుని అన్నాడు. ''సరే ముందు

నించి చెపుతాను విను విజయా నీకు తెలుసు, మా నాన్న గరు చాలా చిన్న ఉద్యోగి అన్నది. నల్గురు పిల్లలకి మామూలు చదువులు చెప్పించడమే ఆయనకి తలకు మించిన పని. నేను చిన్నప్పటినించి చదువులో చురుకు. ప్రతి క్లాసులో ఫస్టు వచ్చే వాడిని. మెట్రిక్, ఇంటర్లో ర్యాంకు కూడా వచ్చింది. ఇంజనీరింగు చదవాలని నాకోరిక. ఇంత బాగా చదువుకున్న నన్ను ఆయన నా కోరిక విని నిరాశ పర్చలేక అతి కష్టం మీద ఇంజనీరింగు చదివించారు. నా తోటి వారందరో, ఫారిన్ వెళ్ళడానికి పరీక్షలు రాస్తుంటే ఓ ఫ్రెండు సాయంతో డబ్బు కట్టి నేనూ రాసి ప్యాసయ్యాను. మా లెక్టరర్లు అందరూ నన్నెంతో ప్రోత్సహించి తప్పకుండా అమెరికా వెళ్ళి ఎమ్.ఎస్. చేస్తే మంచి భవిష్యత్తు వుంటుందని ప్రోత్సహించే వారు. ఇండియాలో వుంటే ఎంత సంపాదిస్తాను. ఆ సంపాదనతో నా వాళ్ళని ఏం ఆదుకోగలను. అమెరికా వెళ్ళి బాగా సంపాదించి తమ్ముడు చదువు బాధ్యత తీసుకోవచ్చు. నాన్న గారు చేసిన అప్పులు తీర్చచ్చు. నా ఆలోచనలవి. నాన్నకి నచ్చ చెప్పాను. ఆయన పాపం భవిష్యత్తు అందంగా ఊహించుకుని నా మీద నమ్మకంతో ఇంటిని తాకట్టు పెట్ట అమెరికాకి టెక్కెట్టు కొనిచ్చి పంపారు. అప్పటికి నాకింకా ఎయిడ్ దొరకలేదు. అక్కడికి వెళ్ళాక ఫస్ట్ సెమిస్టర్ తరువాత సాధారణంగా అందరికి ఎయిడ్ దొరుకుతుందని అంతా చెప్పారు. ఎలాగో వెళ్ళి కాలేజీలో జాయిన్ అయితే, ఏదోపని చేస్తూ మూడు నెలలు కష్టపడితే ఎయిడ్ దొరుకుతుందన్న ధైర్యంతో టికెట్టు, మరో రెండు వందల డాలర్లు చేతిలో పెట్టుకుని అమెరికా చేరి కాలేజీలో జాయిన్ అయ్యాను.

వచ్చాక ఒక ఆరు నెలలు నేను పడిన యిబ్బందులు, కష్టాలు చెపితే భారతం అవుతుంది. ఇలా చేతిలో డబ్బు లేకుండా ధైర్యం చేసి రావడం వచ్చేశాను, కాలేజీలో జాయిన్ అయి ఇండియానించి వచ్చిన స్టూడెంట్లు. అందులో తెలుగు వాళ్ళెవరన్నా వుండరా అని వెతికి పట్టుకున్నాను. డాక్టరేట్ చేస్తున్న ప్రసాద్ అన్న అబ్బాయి ఆ క్షణంలో దేముడిలా కన్పించాడు. నీటిలో కొట్టుకుపోయేవాడికి గడ్డి పోచ ఆధారంలా అతన్ని వదలకుండా నా గొడవ విన్పించి ఏదో ఒక పని యిప్పించి వుండడానికి ఓ గదిలో ఎవరితోనన్నా కలిసి వుండే ఏర్పాటు చూసి పెట్టమని వేడుకన్నాను. సాధారణంగా కొత్తగా వచ్చి జాయిన్ అయిన స్టూడెంట్స్ కాస్త సెటిల్ అయ్యేవరకు, రూము అది కుదుర్చుకునే వరకు సీనియర్ స్టూడెంట్లు ఆదుకోడం అక్కడ మామూలే!

వారు పడిన యిబ్బందులు, బాధలు గుర్తు తెచ్చుకొని కొత్తగా వచ్చిన వాళ్ళకి ధైర్యం, మోరల్ సపోర్టే కాక, ఆర్థిక సాయం కూడా చేస్తారు అని విని వున్నాను

కనక అతనికి అంత చెప్పుకున్నాను. ప్రసాద్ యింకొకరితో కల్సి చిన్న టూ రూమ్ అపార్ట్మెంటులో వుంటున్నాడు. వంతుల వారిగా వండుకుంటారు. అతను వండినపుడు యితను యిల్లు క్లీనింగు, ఇతను వండినపుడు అతను పని పంచుకుంటారు. అతను తమిళుడు. వేరే ఏర్పాటు నేను చూసుకునే వరకు తన రూములో సర్ధుకోవచ్చని నాకు భరోసా యిచ్చాడు. ఏదన్నా పెట్రోల్ బంకు, డిపార్ట్ మెంటల్ స్టోరు ఉద్యోగాలు పేపర్ల లో ప్రకటనలు చూసి అప్లై చేయాలన్నాడు.

సాధారణంగా ఇండియానుండి వచ్చిన స్టూడెంట్లు బాగా డబ్బున్నవాళ్ళు, డాలర్లు మేనేజ్ చేయగల్గిన వారు తప్ప మిగతా మామూలు వాళ్ళంతే ఎయిడ్ దొరికే వరకు యూనివర్శిటీలో టీచింగ్ అవకాశం వుంటే అక్కడ, లేదంటే పార్ట్టైం ఉద్యోగాలు చేస్తూ రాత్రి షిఫ్టు డ్యూటీలు చేసి డబ్బు సంపాదింస్తారు. ముగ్గురు నలుగురు కలిసి చిన్న ఇల్లు తీసుకొని వండుకుంటూ, ఉద్యోగాలు, చదువుతో ఓ ఏడాది – ఎంతో కష్టపడతారు. ఎంత చిన్న ఉద్యోగానికైనా సిద్ధపడాలి. ఇండియాలో తమ కొడుకు అమెరికా వెళ్ళాడని మురిసి పోతారు తల్లితండ్రులు. కానీ కొత్త మొహాలు. కొత్త వాతావరణం, కొత్త యూనివర్శిటి, కొత్త యింగ్లీషు ఉచ్చారణ. యింట్లో కాఫి గ్లాసు దగ్గర నించి అందించే తల్లి. డబ్బు సమకూర్చే తండ్రుల దేశం నుంచి వచ్చిన మేము అంట్లు తోముకుంటూ, బట్టలుతుకుకుంటూ, వండుకుంటూ పార్ట్ టైం ఉద్యోగాలు చేస్తూ, యిటు రాత్రి పగలు కష్టపడి రెండేళ్ళలో ఎమ్.ఎస్.ని ఏణ్ణర్థంలో ముగించాలన్న పట్టుదలతో చదువుతూ ఎంత కష్టపడతారో, అందులో అన్ని అలవాటయ్యే వరకు ఎంత అవస్థ పడతామో మీకు అర్థంగాదు. అందుకే అమెరికా వచ్చే అబ్బాయిలు యిండియాలో ఎంత బాధ్యతా రహితంగా, అల్లరి చిల్లరగా తిరిగినా యిక్కడికి వచ్చి ఒక ఏడాది వుండే సరికి పొగరు, వగరు అన్నీ అణిగి, ప్రతి పని స్వంతంగా చేసుకుంటూ మెచ్యూర్డ్ అయిపోతారు.

సరే, సుసాన్ సంగతి చెప్పకుండా యిదంతా చెప్తున్నాను అని విసుక్కోకు. సుసాన్ నా కెలాంటి స్థితిలో పరిచయం అయిందో ఆ వాతావరణం నీ కర్థం కావాలని యిది చెప్పాను. సుసాన్ ఇల్లు క్లీనింగ్కి వారానికి ఒకసారి ఆదివారం వచ్చినపుడు చూశాను. ఆశ్చర్యపోకు. నీలాగే సుసాన్ లాంటి అమ్మాయి క్లీనింగ్ మెయిడ్ అని వినగానే మొదట నేను ఆశ్చర్య పడ్డాను. కాని అక్కడ ఇది మామూలే.. కాలేజి పిల్లలు, మధ్య తరగతి అమ్మాయిలు ఇలా పార్ట్ టైము ఉద్యోగాలు

చేసి సంపాదిస్తారు. సుసాన్ కుటుంబం చితికి పోయిన కుటుంబం. తండ్రి తాగి తాగి డబ్బంతా తగలేసి ఏక్సిడెంటులో కింద భాగం అంతా చచ్చుబడి మంచంలో పడి వుంటాడు. సుసాన్ కాక యింకా ముగ్గురు పిలల్లు. తల్లి ఏదో చిన్న ఉద్యోగం చేస్తుంది. సుసాన్ కాలేజీలో చదివే తాహతు లేక ఏదో చిన్న ఉద్యోగం చేస్తూ తల్లికి సాయపడుతూ యిలాంటి పార్ట్ టైము ఉద్యోగాలు చేస్తుంది, తన స్వంత ఖర్చుకి మేం బాచిలర్స్‌కి అలవాటు కాకపోవడం వల్ల టైము లేక వారానికి పది డాలర్లు యిచ్చి క్లీనింగ్‌కి మెయిడ్‌గా కుదుర్చుకున్నారు మా ఫ్రెండు, అతని రూము మేటు, ఆదివారం వచ్చి యిల్లంతా వ్యాక్యూమ్ క్లీనింగ్ చేసి, వంటిల్లంతా శుభ్రం చేసి, బాత్ రూములు తళతళలాడేట్టు కడిగి, కిటికీలు అద్దాలు తుడిచి, బట్టలు వాషింగ్ మెషీన్‌లో వేసి, యిస్త్రీ చేసేది. స్టవ్ అంతా మరకలు, బాత్ రూం అంతా మరకలు, యిల్లంతా చండాలంగా చేసేవాళ్ళం. 'యూ దర్టీ పిగ్స్, లేజి బగ్స్ - ఇంత డర్టీగా చేస్తున్నారు యిల్లు అంటూ ముద్దుగా విసుక్కుంటూ పాపం అంతా చేసేది. ఆరోజు పాపం కాఫీ, బ్రేక్ ఫాస్ట్ కూడా చేసి పెట్టేది. మా పట్ల సుసాన్ ఎంతో అభిమానం చూపి అందరికంటే ఎక్కువ పని చేసి పెట్టేది. నా సంగతంతా మా ఫ్రెండు చెపితే తను పనిచేసే గ్యాస్ స్టేషనులో రాత్రి షిఫ్టు అతను మానేసాడని, ఆపని కుదురుస్తానని, నన్ను తీసికెళ్లి యజమానికి పరిచయం చేసి ఉద్యోగం యిప్పించింది.

వారానికి ఎభై డాలర్ల ఉద్యోగంలో ప్రవేశించాను. కనీసం తిండి ఖర్చన్నా సంపాదించాలి మిత్రుడి మీద ఆధారపడకుండా. రాత్రి తొమ్మిది నుంచి తెల్లారి ఆరు వరకు డ్యూటి. పుస్తకాలు అక్కడికే పట్టుకెళ్లి చదువుకునే వాడిని, సుసాన్ క్యాష్ కౌంటరు, నేను మిగతా పనులు చూడ్డం. టీచింగ్ జాబ్ కోసం ప్రయత్నిస్తున్నాను. ఎయిడ్ వచ్చినా అది కాలేజీ ఫీజుకే సరిపోతుంది. భోజనానికి ఏదో చేసి సంపాదించాలి. ఇంకో మంచి పార్ట్‌టైం ఉద్యోగం దొరికే వరకు యిదే గతి. ఆ ఉద్యోగం యిప్పించిన సుసాన్ పట్ల నా మనసంతా కృతజ్ఞతా భావంతో నిండిపోయింది. చదువుతో, నిద్ర ఆగలేక పడుకుంటే పాపం నన్ను లేప కుండా నాపని తనే చూసేది చాలా మటుకు.

''నేను పగలు, యింటి కెళ్లి పడుకుంటా పాపం, నీవు మళ్ళీ కాలేజీ వెళ్ళాలి, పడుకో అంటూ అభిమానంగా మాట్లాడేది. సుసాన్ అందానికి, ఆమె అభిమానానకి నాకు తెలియకుండానే ఆమెకి దగ్గరయిపోయాను. పరాయి దేశంలో వంటరి తనంలో సుసాన్ కంపెనీ, రాత్రి ఎవరూ లేని ఏకాంతం, వయసువేడి, ఏం చేసినా ఆ దేశంలో ఎవరు పట్టించుకోరు. ఎవరికీ తెలియదు అన్న ధైర్యం అన్నింటికంటే ఆమె అభిమానంతో అన్ని విషయాలలో నన్ను ఆదుకున్న మంచితనం

ఆమె పట్ల ఆకర్షణ, అభిమానం మొదలై మూడు నెలలకే ప్రేమగా మారింది. ఈ లోగా ఫస్ట్ టరమ్ ఫీజు కట్టాల్సి వచ్చింది. ఎయిడ్ యింకా రాలేదు. ఏం చెయ్యాలో తోచక ఫ్రెండుని అడిగాను. అతనూ స్టూడెంట్. అతని దగ్గర నూట ఏభై డాలర్లు వుంటే యిచ్చారు. నేను మూడు నెలల్లో కష్టపడి దాచిన నూరు డాలర్లు, ఇంకా రెండొందల ఏభై డాలర్లు కావాలి గాభరాపడిపోయాను. పాపం సుసాన్ తన యజమానితో చెప్పి తను పూచి వుండి నెలకింత అని కోసుకునేటట్టు అడ్వాన్స్ యిప్పించింది. దాంతో నాకృతజ్ఞత మరింత పెరిగిపోయింది. మనసారా అభిమానించి ప్రేమించసాగాను. తనూ నా పట్ల ఆకర్షితురాలైందని మాటలు, చేతలతో చూపేది. వయస్సులో వున్న వాళ్లం, యీ డేటింగులు, లవ్ ఎఫైర్లు పట్టించుకోని దేశంలో మేం దగ్గరవడానికి ఏం భయపడలేదు. మా రూమ్మేట్లు యిద్దరూ డాక్కరేట్లు చేస్తున్నారేమో. ఎప్పుడూ లైబ్రరీల్లో రిఫరెన్స్‌లు చేసుకుంటూ, నోట్సులు రాసుకుంటూ, ఏ రాత్రో చేరే వారు పడుకోడానికి. మా పరిచయం ప్రేమగా మారాక సుసాన్ ఎవరూ లేనపుడు యింటికి కూడా వచ్చేది. సుసాన్‌ని నిజంగా ప్రేమించడం మొదలు పెట్టాను. ఆ అమ్మాయి సామాన్య సంసారం నించి, కష్టాల మధ్య పెరిగిన పిల్ల, నాదీ అంతే కథ. చదువయ్యాక అందరిని ఒప్పించి పెళ్ళాడాలనుకున్నాను. ఆరు నెలల తరువాత ఎయిడ్ వచ్చింది. మరో డిపార్ట్ మెంటల్ స్టోర్సులో వారానికి నూరు డాలర్ల ఉద్యోగం దొరికింది. టీచింగ్ ఉద్యోగం ఇంకోరెండు నెలల్లో దొరకచ్చు. కాస్త పరిస్థితి చక్కపడ్డాక చదువు మీదే మనసు లగ్నం చేసి ఎమ్. ఎస్. ఏణ్ణర్థంలో పూర్తి చేయాలని, పట్టుదలగా కష్టపడసాగాను. మా యిద్దరి అనుబంధం రోజు రోజుకి పెరిగింది. ఆమెని చదువయి ఉద్యోగం వచ్చాక పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. కానీ ఆలోచనలు, అభిప్రాయలని తలకిందులు చేసి ఒక రోజు హఠాత్తుగా సుసాన్ వచ్చి తను ప్రెగ్నెంట్ అని యింట్లో తల్లి అడిగి తిట్టిందని ఏడుస్తూ చెప్పింది. తను ఫ్యామిలీ ప్లానింగ్ మాత్రలు వేసుకుంటున్నానని చెప్పేది. మరి ఇదెలా జరిగిందంటే ఆ మధ్య ఒకటి రెండు రోజులు మర్చిపోయానని చెప్పింది. నేనున్నస్థితిలో పెళ్లిచేసుకోలేను అబార్షన్ చేయించుకోమన్నాను. డబ్బులేదని నసిగింది. మూడు వందల డాల్లరవుతుందని కావాలని కూర్చుంది. నా దగ్గిర అంత డబ్బు లేక నా రుమ్మేటుకి యీగొడవ చెప్పి డబ్బడిగాను. అతను నన్ను యిలాంటి గొడవల్లో యిరుక్కున్నందుకు గట్టిగా మందలించి యిలాంటి అమ్మాయిలు యిలాంటి వంకలతో బ్లాక్ మెయిల్ చేసి డబ్బు గుంజుతారు యిప్పటికైనా వద్దు అని కేకలేసాడు. డబ్బు తీసికెళ్ళి సుసాన్ కొన్నాళ్లు మళ్లీ అసలు కనపడలేదు. పోనీ గొడవ

వదిలిందని సంతోషించాను. ఈ సంఘటనతో సుసాన్ పట్ల ప్రేమ, సానుభూతి తగ్గిపోయింది.

తరువాత ఐదునెలలకి తొమ్మిదో నెలకడుపుతో మళ్లీ వచ్చింది సుసాన్. నిర్ఘాంతపోయాను. అబార్షన్‌కి లేటయిందని చేయనంది డాక్టరు తల్లితిట్టి యింట్లోంచి పంపించేసిందని. యీపని ఆపని చేసుకుంటూ వేరే వుంటున్నాను, యిప్పుడు డెలివరి టైమయింది చేతిలో డబ్బులేదు. చూసే దిక్కులేదు డెలివరి ఖర్చునాదే నని, వెయ్యి డాలర్లవుతుందని నీదే భాధ్యత అంటు నిలేసింది గుండెలదిరిపోయాయి. వెయ్యి డాలర్లు ఎక్కడ నించి తేనూ. మా స్నేహితుడు చెప్పింది అక్షరాలా నిజమయింది. నాదగ్గిర డబ్బు లాగడానికి వేసిన ఎత్తుఅని తన వలలో చిక్కున్నానని అర్థం అయిభయపడ్డాను. డబ్బీయకపోతే యాగిచేసి అందరికి చెప్పి నా పరువు పొగొడ్తుందని, ప్రొఫెసర్లకి నాసంగతి చెలిస్తే నాచదువు దెబ్బతిని భవిష్యత్తుపాడవుతుందని భయపడి యిద్దరి ముగ్గురు స్నేహితుల దగ్గిర అప్పుచేసి డబ్బిచ్చి యింక నాదగ్గిరకి రావద్దని గట్టిగాచెప్పాడు.

సుసాన్ కొడుకుని కంది. ఆతర్వాత పదిహేను రోజులకి, నెలకి వచ్చి వందడాలర్లీయి,పిల్లాడిపోషణా భారం నీదే అంటూ కుర్చునేది. ఏదో కొంత యిస్తే కాని వదిలేది కాదు. గట్టిగా యివ్వనని పొమ్మంటే నీకొడుకుని నీవేం చేసుకుంటావో చేసుకో వదిలిపోతానని బెదిరించేది. వాడి మెయిన్‌టెన్సెస్‌కి కోర్టులో దావా వేస్తానని బెదిరించింది. భగవంతుడా ఎలాంటి పరిస్థితిలో యిరుక్కున్నాను. రాత్రింబగళ్ళు నిద్రపట్టేదికాదు. ఈ ఆపద నించి గట్టెకించమని దేవుడ్ని ప్రార్థించేవాడిని. భగవంతుడు నామొర ఆలకించినట్టు క్రిస్‌మస్ పండుగ రోజున మా ఫ్రెండ్ కజిన్, ఆవూర్లోనే యింకో యూనివర్శిటీలో డాక్టరు చదువుతన్న అతను వచ్చాడు. ఇది వరకు రెండు మూడుసార్లు చూశాను అతన్ని - ఈ సారి అతను చాలా వర్రీడ్‌గా డల్‌గా ఏదో పోగొట్టుకున్న వాడిలా వుంటే తరిచి తరిచి మా ఫ్రెండ్ అడిగితే ఓ గొడవలో ఇరుక్కున్నాని తమ రూము క్లీను చేయడానికి వచ్చే మెయిడ్‌తో తొందరపడి యిరుక్కున్నానని, ప్రెగ్నెంట్ అయి పిల్లాడినికని డబ్బులు గుంజుతూ బ్లాక్‌మెయిల్ చేస్తూందని ఎలా వదుల్చుకోవాలో అర్థం కావడం లేదని దిగులుగా అన్నాడు. అంచనా కథలాగే వుంది. మే యిద్దరం ఆశ్చర్యంగా పేరు వివరాలు అడిగితే పేరుకాక ఫోటో చూపించి ఏం చెయ్యడంఅని సలహా అడిగాడు. ఆ ఫోటో చూసి నిర్ఘాంతపోయాను సుసాన్ ది ఆ ఫోటో. అంతా విని అతనూ తెల్లపోయాడు. అంటే ఇక్కడ నాతో అక్కడ అతనితో ఇలాంటి నాటకం ఆడి యిద్దరిని బ్లాక్‌మెయిల్

చేసి డబ్బు గుంజుతుంది. మా యిద్దరిలో ఆ పిల్లాడు. ఎవరి పిల్లాడో తెలియదు. మేమేకాక యింకెవరన్నా వున్నరేమో తెలియదు. మాకు సుసాన్ మా గుప్పిట్లోకి వచ్చిందని సంతోషం కల్గింది. యిద్దరం కల్సి సుసాన్‌ని నిలేసి బెదిరించి, మాతో యిలా ఆటలాడినందుకు పోలీస్ కంప్లైంట్ యిస్తాం అని జైల్లో వేయిస్తాం అని బెదిరించి, మళ్లీ మా దగ్గరికి రావద్దని చెరో వంద డాలర్లు యిచ్చి వదిలించుకొన్నాం. ఆనాడే మేం నిర్ణయించుకున్నాం మేం పెళ్లి చేసుకుంటే భార్యకీ సంగతి ముందుగా చెప్పాలని, సుసాన్ బ్లాక్ మెయిలు చేసి పెళ్ళాలతో చెప్పేలోగా మేమే ముందుగా చెప్పి వాళ్లని హెచ్చరించాలని అనుకున్నం. ఆ దెబ్బతో సుసాన్ బాధ వదిలిందని సంతోషించి, ఉద్యోగం రాగానే ఇండియా వచ్చి పెళ్ళి చేసుకున్నాను. నీకు చెప్పే లోగానే సుసాన్ యింత తొందరగా వస్తుందని అనుకో లేదు. సుసాన్ ఫ్రెంచి అని ఇంగ్లీషు రాదని అంది. అది శుద్ధ అబద్ధం. తను అమెరికన్, అంతా విడమర్చి నీకు చెప్పేస్తే బ్లాక్‌మెయిలింగుకి అవకాశం వుండదు కదా, ఇవాళ నీదగ్గరికి వచ్చి కాస్త చెప్పి నీబుర్రలోకి అనుమానం ఎక్కించి, రేపు నాదగ్గరికి వచ్చి నీభార్యకి చెప్తానని భయపెట్టి డబ్బు లాగాలని ఎత్తు విజయ సుసాన్ యిలాంటిదని తెలియక మోసపోయాను. తనని నిజంగా ప్రేమించి పెళ్లి చేసుకోవాలనే అనుకున్నను. తను డబ్బులకోసం యిలా నాటకాలాడి, బ్లాక్‌మెయిలు చేస్తుందని కలలో కూడా అనుకోలేదు. మా యిద్దరితో ఒకేసారి యిలా నాటకం ఆడింది. యింకెంత మందితో చేస్తుందో యిలాంటి పని. విజయా వయసు వేడిలో, ఒంటరితనంతో, సుసాన్ చేసిన సాయానికి కృతజ్ఞతతో ఆమె వలలో పడ్డాను. ఆ సమయంలో నేనున్న స్థితి అర్థం అయితే నే చేసింది తప్పే అయినా క్షమించగలవు. చేసిన తప్పుకి చాలానే మూల్యం చెల్లించాను, నేననుభవించిన టెన్షన్ శిక్షనాకు, నిన్ను మోసం చెయ్యాలని, చేస్తున్నానని ఎన్నడూ అనుకోలేదు. ముందు చెపితే చూస్తూ చూస్తూ ఇండియాలో ఏ తల్లిదండ్రి అంగీకరించరన్న భయంతో పెళ్ళికి ముందు చెప్పలేదు ప్లీజ్ నన్నర్థం చేసుకో, నేను దోషినికాని ద్రోహినికాను. ఎంతమంది ఆఫైర్లు నడపడం లేదు ఎంత మంది కాలేజీ పిల్లలతో ఆఫీసర్లు సెక్స్ సంబంధాలు పెట్టుకోవడం లేదు. కాలేజీ అబ్బాయిలు అమ్మాయిలు ఆకర్షింపబడతారు. కలలు కంటారు. కాస్త ధైర్యం వున్న వారు ముందుకు వెడతారు. ఈ ఫ్యామిలీ ప్లానింగులు వచ్చాక ఎంత మంది పవిత్రంగా వున్నారన్నది ప్రశ్నార్థకం ఆలో చించు విజయ, ఒక్కమాట అబద్ధం చెప్పలేదు నీవు నన్ను మన్నించగలిగితే సంతోషిస్తాను. లేదు అంటే ఏం చెయ్యాలన్నది నీవే నిర్ణయించి చెప్ప, చాల బాధగా, దైన్యంగా అని గదిలోకి వెళ్ళిపోయాడు. శ్రీరాం చెప్పింది

వినగానే చటుక్కున విజయకి ఓ సంగతి గుర్చు వచ్చింది. చిన్నప్పటినుంచి ఇంట్లో వుండే బావ అంటే తనకి తనంటే బావకి అభిమానం ప్రేమ. బావ అందం, కవిత హృదయం, కమ్మగా పాడే బావ గొంతు అన్నీ తనని ఆరాధనలో పడేసింది. చదు వబ్బలేదని, తన ఇంట్లో తమ దయమీద బతికే బావంటే తండ్రికి గిట్టేది కాదు. చదువు, ఉద్యోగం లేదు. కవితలు, కథలు అన్నం పెడతాయా, వాడ్ని కట్టుకుని ఏం తింటావు. అంటూ తండ్రి బావతో పెళ్ళికి యిష్టపడలేదు. ఇద్దరం ఒకరికి ఒకరు దూరంకాలేక దగ్గర అవలేక ఎంతో బాధపడ్డారు. తనకి పెళ్ళి సంబంధాలు చూడడం మొదలయ్యాక తిరగబడితే తండ్రి ససేమిరా అన్నారు. అలాంటి స్థితిలో ఒ రోజు ఇంట్లో ఎవరూ లేనప్పుడు బావ తనను కౌగిలించుకుని ముద్దులు పెట్టుకుని కన్నీళ్ళు కార్చాడు. తను వివశురాలైంది. ఆఖరి క్షణంలో మేల్కొంది. తమ యిద్దరి మధ్య పెరుగుతున్న సాన్నిహిత్యాన్ని గమనించి తండ్రి బావని యింట్లోంచి పంపేశాడు. తండ్రి మాటల్లో నిజం యింకో రెండేళ్ళ తరువాత గుర్తించి, బావని మర్చిపోడానికి ప్రయత్నించి తల్లితండ్రి తెచ్చిన సంబంధాలకు తల ఒగ్గింది. మర్చిపోవడం అంత సుళువు కాకపోయినా మనసుని సమాధానపరుచుకుని పెళ్ళికి సిద్ధపడింది. ఆమెరికా సంబంధం అనగానే యీ పెళ్ళికి సిద్దపడింది. అమెరికా సంబంధం అనగానే యీ పెళ్లికి మరో మాట లేకుండా వప్పుకొంది. శ్రీరాం అన్నట్టు తనూ మానసికంగా, కొంత వరకు శారీరకంగానూ వ్యభిచరించింది. శ్రీరాం చేసిన తప్పు, వప్పుకున్నాడు నిజాయితీగా అతనన్నట్టు పెళ్ళి తరువాత అయితే తనని మోసగించినట్టు లెక్క. పెళ్ళికి ముందు చాలా మంది అబ్బాయిలు, అమ్మాయిలు జీవితాల్లో అనేక సంఘటనలు జరుగుతాయి. ఈ సుసాన్ రాకపోతే అతని గతం తనకేం తెలిసేది? తనగతం అతనికీ తెలియదు. యిప్పుడు తనేదో పెద్ద పవిత్రంగా వున్నట్టు శ్రీరాంని తప్పుపట్టడం ఏమిటి. ఇప్పుడు శ్రీరాంని వదిలి వెళ్ళే ధైర్యం తనకుందా. కాపురం వదులుకుని వచ్చిన తనని తల్లితండ్రి ఆదుకుంటారా. నలుగురు నోళ్ళల్లో తను పడి కాపురం రట్టు చేసుకంటే వచ్చేదేంవుంది. తప్పు చేసి నిజాయితీగా చెప్పిన శ్రీరాంని క్షమించకపోవడం ఔదార్యం కాదు. గతం గతః అనుకోవడం ఒక్కటే ఈ పరిస్థితిలో ఉత్తమం. తేలికయిన మనసుతో శ్రీరాం గదివైపు నడిచింది విజయ.

(ఆంధ్రజ్యోతి - వీక్లీ - 15-08-97)